క్రిస్టియన్ మైనార్టీలకు అండగా ఉంటా

సనత్‌నగర్: క్రిస్టియన్ మైనార్టీలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీనిచ్చారు. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హయాంలో అనేక కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గ పరిధిలోని చర్చిలు, గ్రేవ్‌యార్డుల అభివృద్ధికి ఎంతో కృషి చేసిన విషయాన్ని వివరించారు. బోయగూడ గ్రేవ్‌యార్డు అభివృద్ధికి రూ.3 కోట్ల ప్రత్యేక నిధులు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, ప్రతినిధులు సురేష్, మనోహర్, సామ్యూల్, జయరాజ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో ఎగరబోయేది కాంగ్రెస్ జెండానే


జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ నామినేషన్ కార్యక్రమంలో డా. కోట నీలిమ

సనత్‌నగర్: జూబ్లీహిల్స్ నియోకజవర్గంలో ఎగరబోయేది కాంగ్రెస్ పార్టీ జెండానే అని పీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ నామినేషన్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. కోట నీలిమ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ గెలుపు బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలదేన్నారు.

ఓయూ పరిధిలో నేటి పరీక్షలు వాయిదా

లాలాపేట: బీసీ సంఘాల తలపెట్టిన రాష్ట్ర బంద్ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 18న జరగాల్సిన అన్ని రకాలైన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఓయూ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. తరువాత తదుపరి తేదీలను ప్రకటిస్తామన్నారు.

వృద్ధుడు అదృశ్యం


రామ్‌రెడ్డి

చిలకలగూడ: మానసికవ్యాధితో బాధపడుతున్న వృద్ధుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడకు చెందిన రామ్‌రెడ్డి (75) విమలమ్మ భార్యభర్తలు. ఈనెల 15న ఉదయం 9.30 గంటలకు చిలకలగూడ వెస్లీ చర్చి వద్ద రామ్‌రెడ్డిని కూర్చోబెట్టి విమలమ్మ పనికి వెళ్లి, తిరిగి వచ్చి చూడగా రామ్‌రెడ్డి అక్కడ కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికి, బంధుమిత్రులను వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం


సునీతదీప్తిక

చిలకలగూడ: కుటుంబ కలహాలతో మహిళ అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మారావునగర్ వెంకటాపురం కాలనీకి చెందిన పూసల సునీత దీప్తిక (42) లోన్ యాప్ ద్వారా రుణం తీసుకునేందుకు అప్లై చేసింది. ఇదే విషయమై ఇంట్లో గొడవ జరిగింది. ఈనెల 11న ఉదయం 6.30 గంటలకు సెల్‌ఫోన్ ఇంట్లోనే ఉంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరలేదు. పలు ప్రాంతాల్లో గాలించిన ఫలితం లేకపోవడంతో సోదరుడు మేఘశ్యామ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

'గాంధీ'లో అమ్మకానికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు

- రంగంలోకి దిగిన వసూల్‌రాజాలు
- ఒక్కో పోస్టుకు రూ. 50 వేలు..



గాంధీఆస్పత్రి: రండి బాబు రండి. అమ్మకానికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు.. రూ. 50 వేలు కట్టండి. ఉద్యోగం పట్టండి అంటు పలువురు దళారులు హల్‌చల్ చేస్తున్నారు. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో వివిధ కేటగిరీల్లో జీవో నంబర్ 1085 ప్రకారం అవుట్ సోర్సింగ్ పద్ధతిన 433 పోస్టులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటిలో 86 పోస్టులు భర్తీ చేసేందుకు ఆస్పత్రి యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ఇదే అదనుగా భావించిన కొంతమంది వ్యక్తులు తామే ప్రభుత్వంతో పాటు సంబంధిత ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి సదరు పోస్టులను మంజూరు చేయించామని, కాంట్రాక్ట్ యాజమాన్యాలతో కలిసి ఆయా పోస్టులను తామే భర్తీ చేస్తామని నమ్మించి అందినకాడికి దండుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒక్కో పోస్టుకు రూ. 50 వేలు చొప్పున వందలాది మంది నుంచి వసూలు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం గాంధీఆస్పత్రిలో 12 కాంట్రాక్ట్ సంస్థల ఆధ్వర్యంలో 207 క్లాస్‌ఫోర్, 154 మంది స్టాఫ్‌నర్సులు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు నూతనంగా మంజూరైన పోస్టులను ఆయా కాంట్రాక్ట్ సంస్థలకు కేటాయించారు. దీన్ని అవకాశంగా మలచుకున్న కొంత మంది వ్యక్తులు పోస్టులు మంజూరు చేయించిన తామే భర్తీ ప్రక్రియ కూడా నిర్వహిస్తామని, ఆస్పత్రి పాలన యంత్రాంగంలో ఎటువంటి సంబంధం లేదని ప్రచారం చేసుకున్నారు.

వేతనాల్లో తేడాతో..

◆ ప్రస్తుతం గాంధీఆస్పత్రి ఆరోగ్యశ్రీ ద్వారా సుమారు 55 మంది అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. నెల వేతనం రూ.17,500 చెల్లిస్తున్నారు. కొత్తగా వచ్చిన జీవోలో నెల వేతనం రూ. 22,500. దీంతో ఆరోగ్యశ్రీ ద్వారా విధులు నిర్వహిస్తున్న వారంతా నూతన జీవో ద్వారా భర్తీ కావాలని భావించి దళారులను ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది. కొంతమంది స్కిల్ట్ సిబ్బంది పారిశుద్ధ్య కాంట్రాక్ట్ సంస్థ జీడీఎక్స్‌లో పేషెంట్ కేర్‌టేకర్లుగా రికార్డుల్లో నమోదు అయిన ప్పటికీ ల్యాబ్, ఈసీజీ, ఆక్సిజన్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, లిఫ్ట్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి వేతనం కేవలం రూ. 13,000. పే రివిజన్ కమిషన్ (పీఆర్‌సీ) వస్తే ఆటోమేటిగ్గా వేతనం పెరుగుతుంది. నూతన జీవో ద్వారా భర్తీ అయితే వేతనం భారీగా పెరిగే అవకాశం ఉండటంతో దళారులను ఆశ్రయిస్తున్నారు. డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులను ఆస్పత్రి పాలనయంత్రాంగం ఇప్పటికే గుర్తించిందని, చట్టప్రకారం వారిపై చర్యలు చేపడతామని ఆస్పత్రికి చెందిన ఓ ఉన్నతాధికారి స్పష్టం చేశారు.

ఇవే భర్తీ చేయనున్న పోస్టులు

◆ గాంధీఆస్పత్రిలో వివిధ కేటగిరీల్లో 86 పోస్టులను భర్తీ చేసేందుకు రంగం సిద్ధమైంది. డేటా ఎంట్రీ ఆపరేటర్లు-28, ల్యాబ్ టెక్నీషియన్-25, రేడియోగ్రాఫర్-9, ఎలక్ట్రీషియన్-4, సీటీ, ఎమ్మారై టెక్నీషియన్-4, ఫార్మాసిస్ట్-4, లిఫ్ట్ ఆపరేటర్-3, డ్రైవర్-2, ఎలక్ట్రీషియన్-2, క్యాత్‌ల్యాబ్ టెక్నీషియన్-2, ఈసీజీ టెక్నీషియన్-2 ఆక్సిజన్ టెక్నీషియన్-1 చొప్పున భర్తీ చేయనున్నారు.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు



కొంతమంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దళారుల మాటలు నమ్మి నమ్మి మోసపోవద్దని, భర్తీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి స్పష్టం చేశారు. ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి, దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థుల విద్య, సాంకేతిక అర్హతలు, సీనియారిటీ, రిజర్వేషన్లు వంటి అంశాలను పరిశీలించి అర్హులకు అవకాశం కల్పిస్తామని వివరించారు.

– ప్రొఫెసర్ వాణి, గాంధీ సూపరింటెండెంట్

సాయిబాబా టెంపుల్‌ను పరిరక్షించండి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సమస్యలను విన్నవిస్తున్న మాణికేశ్వర్‌నగర్ వాసులు

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్ ఫేజ్-2లో ఉన్న సాయిబాబా టెంపుల్‌ను పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని మానికేశ్వర్‌నగర్ వాసులు కోరుతున్నారు. ఇటీవల రైల్వే అధికారులు రైల్వే భూముల్లో ఉన్న ఆ సాయిబాబా టెంపుల్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ విషయాన్ని టెంపుల్ నిర్వాహకులు స్థానిక నాయకులు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. దీంతో పాటుగా సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌యూబీ మాణికేశ్వర్‌నగర్ నుంచి వారసీగూడాకు వెంటనే పూర్తి చేయాలని, బస్తీలోని లాల్‌బహదూర్ కమ్యూనిటీ హాల్‌కు అదనపు అంతస్తు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించి కిషన్‌రెడ్డి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో టెంపుల్ అధ్యక్షులు గుండురెడ్డి, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కమ్యూనిటీ హాల్ ప్రెసిడెంట్ వెంకటేష్, బీజేవైఎం నాయకులు అయ్యప్పరెడ్డి, తార్నాక డివిజన్ అధ్యక్షులు ఉపేందర్ యాదవ్, మణి స్వామి, చరణ్‌రాజ్ తదితరులున్నారు.

మంత్రిని కలిసిన ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ నేతలు



లాలాపేట: పంచాయితీ రాజ్ చట్టం21(3)ను సవరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల సంతానం పరిమితిని ఎత్తివేసి అందరికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కల్పించినందుకు ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని, రాష్ట్ర పశుసంవర్ధక, యువజన సర్వీసుల శాఖా మంత్రి వాకిటి శ్రీహరిని మార్యదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. 30 ఏళ్ల నుంచి ఎన్నికల్లో పోటీ చేయకుండా దూరంగా ఉన్న వారందరూ ప్రభుత్వం మంత్రి మండలి తీసుకున్న నిర్ణయంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ జేఏసీ చైర్మన్ రాథోడ్ రవీందర్ నాయక్, ధరావత్ సురేష్ నాయక్, తేజావత్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

బీసీ బంద్‌కు ఔటా(సీ) మద్దతు

లాలాపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే న్యాయమైనతో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా బీసి సంఘాలు చేపట్టిన బీసీ బంద్‌కు ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్(ఔటా-కాంటాక్టు) సంపూర్ణ మద్దతు ప్రటిస్తున్నట్లు ఔటా(సీ) అధ్యక్షుడు డాక్టర్ పరశురాం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధ్యాపకులంతా శాంతియుతంగా బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. బీసీ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

సందడిగా ఫ్యాకల్టీ బ్యాడ్మింటన్ పోటీలు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ఫెస్ట్‌లో భాగంగా శుక్రవారం ఫ్యాకల్టీ బ్యాడ్మింటన్ పోటీలు సందడిగా జరిగాయి. డబుల్స్ విభాగంలో పీఎస్ రాంబాబు, సందీప్ రాజ్‌లు విన్నర్స్‌గా, దినేష్, బ్రహ్మేశ్వర్‌లు రన్నర్స్‌గా నిలిచారు. సింగిల్స్ విభాగంలో జనరల్ సర్జరీ అసోషియేట్ ప్రొ. ఎస్‌పీ రాంబాబు విన్నర్‌గా, అనస్థీషియా అసోషియేట్ ప్రొఫెసర్ అబ్బయ్య రన్నర్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఎస్‌పీ రాంబాబు, సృజనలు విన్నర్స్‌గా, బ్రహ్మేశ్వర్ రజితలు రన్నర్స్‌గా నిలిచారు. స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ కిరణ్‌మాదల, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ వేణు, విద్యార్థి ప్రతినిధి డాక్టర్ లెనిన్‌లు అంపైర్లగా బాధ్యతలు నిర్వర్తించారు. విజేతలకు గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణిలు ప్రోత్సాహక బహుమతులు అందించి అభినందించారు.


గాంధీ ఫ్యాకల్టీ బ్యాడ్మింటన్ పోటీ విజేతలు

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు తెలియాలి


అవగాహన కార్యక్రమంలో నార్త్‌జోన్ ట్రాఫిక్ అడ్మిన్ ఏసీపీ లక్ష్మణ్

సనత్‌నగర్: విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన ఎంతో అవసరమని, బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలంటే రోడ్డు భద్రతపై శ్రద్ధ చూపాలని నార్త్ జోన్ ట్రాఫిక్ అడ్మిన్ ఏసీపీ లక్ష్మణ్ సూచించారు. పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవ సందర్భంగా ట్రాఫిక్ విధులు, ట్రాఫిక్ పోలీసులు ఉపయోగించే పరికరాలపై శుక్రవారం బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు అవగాహన కల్గించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ లక్ష్మణ్ హాజరై ట్రాఫిక్ పోలీసుల విధుల గురించి వివరించారు. అలాగే విద్యార్థులకు మైనర్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ ఉల్లంఘన, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ప్రాముఖ్యత తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, ఎస్‌ఐలు శివరాజ్, అశోక్‌రెడ్డి, సెయింట్ జాన్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ పవన్, ఉద్భవ్ స్కూల్, కస్తూర్బా స్కూల్, డాన్‌బర్గ్ మోడల్ స్కూల్ నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీటీఐ సిబ్బంది పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ , రోడ్డు భద్రత అందరి బాధ్యత అని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

ఆతిథ్య రంగ అభివృద్ధికి మహిళా చెఫ్‌ల సహకారం



సనత్‌నగర్: ఆతిథ్య రంగాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో మహిళా చెఫ్‌ల సహకారం అమూల్యమైనదని పలువురు వక్తలు పేర్కొన్నారు. బేగంపేటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ శ్రీశక్తిలో అంతర్జాతీయ చెఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రముఖ హోటల్స్‌కు చెందిన విశిష్ట మహిళా చెఫ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు సాధించిన అసాధారణ విజయాలను, వంట కళలో వారి చూపిస్తున్న అంకిత భావాన్ని కొనియాడారు. చెఫ్‌లు తమ కళలో నైపుణ్యానికి అద్దంపట్టే రీతిలో వివిధ రకాల వంటకాలను ప్రదర్శించి అబ్బురపరిచారు. ఈ కార్యక్రమానికి హాజరైన అతిథి చెఫ్‌లు తమ జీవిత ప్రయాణాలు, తాము ఎదుర్కొన్న సవాళ్లను విద్యార్థులతో పంచుకున్నారు. దక్షిణ భారతదేశంలోని ఆహారం, పానీయాల రంగంలో మహిళల జీవిత కథనాలతో రూపొందించిన 'ది అదర్ సైడ్' అనే డాక్యుమెంటరీ చిత్రాన్ని ఇదే వేదికపై ప్రదర్శించగా హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులను ఆలోచింపజేసింది. కార్యక్రమంలో ఆతిథ్య రంగ ప్రముఖులు, పేరెన్నిక గన్న హోటళ్ల చెఫ్‌లు, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి


గాంధీ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న నర్సింగ్ సిబ్బంది

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ సిబ్బందికి తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహా డిమాండ్ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా కాంట్రాక్ట్ యాజమాన్యాలు వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ యాజమాన్యాలతో చర్చించి వేతన బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తానని సూపరింటెండెంట్ వాణి హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ ఫ్లోరెన్స్‌మర్లిన్, గాంధీ నర్సింగ్ ఆఫీసర్స్ యూనియన్ ప్రతినిధులు సుందరమ్మ, నాగమణి, అనిత, పుణ్యమ్మ, శోభారాణి, లక్ష్మీ, ప్రభలత, రాజేశ్వరీలు పాల్గొన్నారు.

ఎన్నో జన్మల పుణ్యం అయ్యప్ప మాలధారణ

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

రాంగోపాల్‌పేట్: అయ్యప్ప మాలధారణ చేయడం ఎన్నో జన్మల పుణ్యఫలమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ గణపతి దేవాలయం నుంచి శబరిమలై వరకు 120 మంది అయ్యప్ప భక్తులు నిర్వహించే పాదయాత్రను ఆయన ప్రారంభించారు. 18 ఏళ్ల నుంచి పాదయాత్రగా శబరిమలకు వెళ్లడం అయ్యప్ప స్వామిని దర్శించుకోవడం వారి నిబద్ధత, భక్తి శ్రద్ధలకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి పాద యాత్ర బృందం సభ్యుడు వెంకటేష్‌యాదవ్, నాయకులు స్కైలాబ్ యాదవ్, హరికృష్ణ, నాగేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

బొల్లారం: బొల్లారంలోని డౌటన్ బజార్ ప్రాంతంలో ఎన్‌సీవీబీడీసీ (నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్) ఆధ్వర్యంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా డ్రైనేజీలు, నీటి నిల్వలు పరిశీలించి, డెంగీ వంటి వ్యాధులను నివారించేందుకు బొల్లారం యూపీహెచ్‌సీలో ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల సంతతి పెరగకుండా నీటి నిల్వలను తొలగించాలన్నారు. ఈ సందర్భంగా అనుమానితులకు డెంగీ పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ బొల్లారం వైద్యాధికారి డా. నాగార్జున, సిబ్బంది పద్మ, సువర్ణ, వాసవి పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల నేతలు

రాంగోపాల్‌పేట్: బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను ప్రజలందరూ విజయవంతం చేయాలని దళిత జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జ యాదగిరి అన్నారు. ఈ బంద్‌కు దళిత జన సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు. శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో ఎంజీరోడ్డులో బంద్ విజయవంతం చేసేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి పిడిశెట్టి చంద్రమౌళి, కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో...

కంటోన్మెంట్: జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని కంటోన్మెంట్ బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ సంఘాలు ఇచ్చిన శనివారం నాటి బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మారేడుపల్లిలో నిర్వహించిన సమావేశంలో పార్టీలకు అతీతంగా కంటోన్మెంట్ బీసీ నేతలు కార్పొరేటర్ కొంతం దీపిక నరేశ్, పిట్ల నాగేశ్, బానుక మల్లికార్జున్, టోపీ శంకర్, టీఎన్ శ్రీనివాస్, బీఎన్ శ్రీనివాస్, నర్సింహ ముదిరాజ్, గౌరీశంకర్, వెంకటేశ్, నారాయణ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు. శనివారం ఉదయం 6.00 గంటలకు జూబ్లీ బస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించే భారీ ధర్నాలో పెద్ద ఎత్తున బీసీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీసీ కులాలు అన్నీ అభివృద్ధి చెందాలంటే తగిన రిజర్వేషన్‌లు అమలు చేయాల్సిందేనని అభిప్రాయ పడ్డారు.

ఉద్యమాన్ని తలపించేలా బంద్ పాటించాలి..

లాలాపేట: స్థానిక సంస్థల్లో బడుగు బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని శనివారం ఈ నెల 18న బీసీ జేఏసీ నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు నాగరాజు గౌడ్ కోరారు. శుక్రవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. బీసీ బంద్ మరో తెలంగాణ ఉద్యమాన్ని తలపించేలా వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, పెట్రోల్ బంక్‌లు, సినిమా హాల్లు స్వచ్ఛందంగా మూసి వేసి బంద్‌ను పాటించాలన్నారు. బీసీ రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నట్లు ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి అన్నారు.

లాలాపేట: బీసీ రిజర్వేషన్ల సాధనకు నేడు తలపెట్టిన బీసీ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ బీసీ శక్తి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో వంశీ, రఘు, సాయితేజ, సుమన్, రవి తదితరులున్నారు.

బీసీ ఉద్యమానికి ఓయూ సిద్ధం..

లాలాపేట: స్థానిక సంస్థల్లో, చట్టసభల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా ఓయూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సిద్ధం అవుతున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్లో చర్చా కార్యక్రమం నిర్వహించారు. బీసీ రిజర్వేషన్ డిమాండ్‌తో శనివారం తలపెట్టిన బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై వివిధ విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడారు. నిజ్జన రమేష్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ చర్చా కార్యక్రమంలో బీసీ అధ్యాపకులు నాగేశ్వర్‌రావు, రామయ్య షపర్డు, వట్టికూటి రామారావుగౌడ్, చెన్నయ్య, లోకేష్, చరణ్, హన్మంతరావు, వెంకట్, బాల్‌రాజ్ యాదవ్, పుప్పాల మల్లేశ్, స్వామియాదవ్, రాజేశ్, జగన్, విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: భూదేవినగర్, జింఖానా, ఆర్పీ నిలయం సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 18న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ(సీబీడీ) కంటోన్మెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు యాదమ్మనగర్, బాలంరాయి ఫీడర్ పరిధిలో గ్రీన్ ఫీల్డ్ కాలనీ, ముత్యంరెడ్డి నగర్, శివనగర్, టెలికాం కాలనీ, సన్‌రైజ్ ఎన్‌క్లేవ్, హేమనగర్, పద్మావతికాలనీ, కానాజీగూడ, బాలంరాయి ఫీడర్ పరిధిలోని బాలంరాయి, హ్యాప్పీ ఎన్‌క్లేవ్, పైగాకాలనీ, విమన్‌నగర్, మార్గదర్శికాలనీ, లమికుతికాలనీ, ఫోర్టీ క్వార్టర్స్ ప్రాంతాల్లో మధుర ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

◆ ప్యారడైజ్ ఏడీఈ పరిధిలో ఓయూ, కిమ్స్, మోండా మార్కెట్, జమిస్తాన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ ఏడీఈ తెలిపారు. ఉదయం 10 నుంచి 1 వరకు మెట్టుగూడ పార్కు, రైల్వే క్లబ్, బీఎస్ఎన్ఎల్ ఎక్సేంజ్, అశోక లైబ్రరీ, బొందలగడ్డ, కృపాఅపార్ట్‌మెంట్, స్కైలాబ్, డీవీకాలనీ, జవహర్‌నగర్‌కాలనీ, డీవీహౌజ్, రామాలయ టెంపుల్, కిమ్స్ ఆస్పత్రి వెనుక, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు బాటాఫీడర్ పరిధిలోని ఆర్పీరోడ్, ఓల్డ్‌గాస్మండి, బాటనీ స్కూల్, వాటర్ వర్క్స్, బన్సీలాల్‌పేట్ క్లాస్ ప్రాంతాల్లో, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఎస్పీ కాలేజ్ ఫీడర్ పరిధిలోని టీఆర్ అపార్ట్‌మెంట్, ఎల్లమ్మ టెంపుల్, స్కంధగిరి, బ్రూక్‌బాండ్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రెవరెండ్ ప్రొ.రాజేశ్వర్ సాల్మన్‌కు డాక్టరేట్

రాంగోపాల్‌పేట్: తెలంగాణ క్రైస్తవ మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారులు, ప్రొఫెసర్, రెవరెండ్ రాజేశ్వర్ సాల్మన్‌కు ప్రయాగ్‌రాజ్‌లోని సామ్ హిగ్గిన్‌బాటం వ్యవసాయ, సాంకేతిక శాస్త్రాల విశ్వవిద్యాలయం (షాట్స్) నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రెవరెండ్ రాజేశ్వర్ సాల్మన్ మెదక్ డయాసిస్‌లోని దక్షిణ భారత చర్చిల్లో పాస్టరల్ కేర్ మినిస్ట్రీస్‌లో పాస్టర్ల కౌన్సిలింగ్ నైపుణ్యాలపై ఒక అంచనా అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ పొందారు. అలాగే ఆయన బిహేవియరల్ థెరపిస్ట్‌గా పోలీసు శాఖ, జైళ్ల శాఖ పలు కౌన్సిలింగ్‌లు అందించారు. అంతేకాకుండా ఆయన కుమార్తె లియో షారోన్ ఇదే విశ్వవిద్యాలయం నుంచి ఫోరెన్సిక్ సైన్స్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేసి పట్టాను అందుకుంది. తండ్రి కుమార్తెలు ఇద్దరూ ఒకే రోజు పట్టాలను అందుకోవడం గమనార్హం.

బల్కంపేటలో కార్పొరేటర్ పూజలు

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు కార్పొరేటర్ దంపతులకు ఆశీర్వచనాలు అందించి ప్రసాదాలను అందజేశారు. సకల జనులు సుభిక్షంగా ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఈ సందర్భంగా కార్పొరేటర్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లో మాగంటి సునీత విజయం సాధించాలని ప్రార్థించినట్లు చెప్పారు.